సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 12 । జనవరి । 2024



మావుళ్లమ్మ వార్షికోత్సవాలు

భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయ 60వ వార్షికోత్సవాలు శనివారం నుంచి 28 రోజుల పాటు జరగనున్నాయి.

8లో ▸



మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ

ప్రభుత్వంతో చర్చలు సఫలం కావడంతో మున్సిపల్ కార్మికులు 16 రోజులుగా చేస్తున్న సమ్మెను విరమించి గురువారం విధుల్లో చేరారు.

8లో ▸



వైభవంగా తిరువీధి సేవ

చినవెంకన్న దివ్యక్షేత్రంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం శ్రీవారు తొళక్కం వాహనంపై క్షేత్ర పురవీదుల్లో ఊరేగారు.

8లో ▸

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన రఘురాం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం: తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ప్రోటోకాల్ నుంచి రాష్ట్ర క్యాబినెట్ మినిస్టర్ హోదా కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియచేశారు. ఆక్వా రంగంలో ఉన్న పలు సమస్యలపై సీఎంతో చర్చించినట్టు తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించే విధంగా సీఎం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు స్థానిక విలేకరులకు చెప్పారు.

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం



ఏలూరు టౌన్: వచ్చే సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి చెప్పారు. ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం జిల్లాలోని డీఎస్పీలు, సీఐలతో ప్రత్యేకంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలకు జిల్లా పోలీస్ యంత్రాంగం సన్నద్ధం కావాలన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటినుంచీ ఎన్నికలు పూర్తిస్థాయిలో ముగిసే వరకూ ఎన్నికల కమిషన్ నియమావళిని పాటిస్తూ క్రమశిక్షణతో, చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలు, నేరాలకు అడ్డుకట్టవేయటం, నగదు, మద్యం అక్రమ రవాణాను నిరోధించటం, అక్రమ ఆయుధాలు సరఫరా వంటి వాటిపై మరింత పటిష్టమైన నిఘా ఉంచాలన్నారు. పోలీస్ సిబ్బంది తమకు కేటాయించిన విధులను అంకితభావంతో నిర్వర్తించాలని, నిర్లక్ష్యం, పొరపాట్లకు తావులేకుండా చూడాలని ఎస్పీ చెప్పారు. అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఎస్బీ సీఐ బీ.అదిప్రసాద్, డీసీఆర్‌బీ సీఐ ఎం.సుబ్బారావు, దుర్గాప్రసాద్, ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, జంగారెడ్డిగూడెం డీఎస్పీ ధనుంజయుడు, పోలవరం డీఎస్పీ రత్నరాజు, నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్, సీఐలు ఉన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్ రీ సర్వే పూర్తి



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం (ప్రకాశం చౌక్): దేశంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికై తాడేపల్లిగూడెంలో చేపట్టిన అర్బన్ రీసర్వే ప్రక్రియ పూర్తి చేయడంపై జేసీ రామసుందర్‌రెడ్డి అధికారులను అభినందించారు. గురువారం తన చాంబర్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన తాడేపల్లిగూడెం అర్బన్ రీ సర్వే పూర్తి చేసిన దస్త్రాలను, మ్యాప్‌లను పరిశీలించి ఆయన సంతృప్తి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్డీవో కె. చెన్నెయ్య, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, పురపాలక సంఘం కమిషనరు డా. ఎ.శామ్యూల్, తహసీల్దార్ ఎస్.శివశంకర్, జిల్లా కలెక్టరేట్ ల్యాండ్ తహసీల్దార్ సీహెచ్ రవికుమార్, సహాయ సిటీ ప్లానర్ జి.సీతారామ్ పాల్గొన్నారు.

రైళ్ల సర్వీసుల పొడిగింపు

ఏలూరు (టూటౌన్): దక్షిణ మధ్య రైల్వే ఆంధ్రప్రదేశ్‌కు ప్రాంతానికి సంబంధించి మూడు రైళ్ల సర్వీసులను పొడిగించింది. విశాఖపట్టణం-విజయవాడ మధ్య నడిచే ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను గుంటూరు వరకూ పొడిగించారు. విజయవాడ-హుబ్లీ మధ్య నడిచే అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను నర్సాపూర్ వరకు పొడిగించారు. పొడిగించిన రైళ్లను గుంటూరు, నర్సాపూర్‌లో శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు జెండా ఊపి ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. పొడిగించిన రైళ్ల సేవలు ఈ నెల 13 నుంచి అందుబాటులోకి రానున్నాయి. నర్సాపూర్, భీమవరం ప్రజలకు గుంతకల్లు, బళ్లారి, హుబ్లీ వరకూ ప్రయాణించడానికి నేరుగా రాత్రి ప్రయాణ సౌకర్యం కలుగనున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఆరిమిల్లి.. చిల్లర లొల్లి

తణుకు టీడీపీ ఇన్‌చార్జి ఆరిమిల్లి రాధాకృష్ణ చిల్లర వేషాలు శృతిమించుతున్నాయి. సామాజిక వర్గాల మధ్య చిచ్చుపెడుతూ ఎన్నికల వేళ కుల రాజకీయాలకు తెరతీయడంపై టీడీపీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. వేల్పూరు కేంద్రంగా అభివృద్ధికి పూర్తిస్థాయిలో మోకాలడ్డుతూ కోర్టులో కేసుల ద్వారా ప్రతి పనికీ విఘాతం కలిగించడంతో పాటు ప్రజాప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలే మిన్నగా చిల్లర రాజకీయాలు చేస్తుండటంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఆరిమిల్లి తీరుతో సొంత పార్టీలో వ్యతిరేకతమవుతోందనే భావన నెలకొంది.

- శృతిమించుతున్న ఆరిమిల్లి చిల్లర వేషాలు
- కోర్టుల్లో పిటిషన్ల ద్వారా ప్రతి పనీ అడ్డగింపు
- నాడు బీసీ కమ్యూనిటీ హాళ్లు, నేడు సీహెచ్‌సీలపై..
- గతంలోనూ తణుకులో ఇదే వ్యవహారం
- ఆరిమిల్లి తీరుతో బీసీ నేతలు టీడీపీకి దూరం
- వేల్పూరులో సామాజిక చిచ్చుకు బీజం
- తణుకులో టీడీపీ ఇన్‌చార్జి ఆరిమిల్లి కుల రాజకీయం



వేల్పూరులో సీహెచ్‌సీ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి కారుమూరి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో తణుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరిమిల్లి రాధాకృష్ణ రోజుకో డ్రామాకు తెర తీస్తున్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేయలేదని, పనులే అసలే చేయలేదంటూ ప్రచారం చేస్తూ మరో వైపు చేస్తున్న ప్రతి పనినీ కోర్టు కేసుల ద్వారా అడ్డుకుంటూ ప్రజాగ్రహం చవిచూస్తున్నారు. గతంలో ఇదే తరహాలో నియంతృత్వ పోకడలతో వ్యవహరించి మళ్లీ అదే రీతిలో రాజకీయం చేస్తున్నారు. నియోజకవర్గంలో వేల్పూరు మేజర్ పంచాయతీ కేంద్రంగా ప్రతి వ్యవహారం సాగిస్తున్నారు. ప్రస్తుతం పంచాయతీలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేయించి అన్ని అనుమతులు తెచ్చి రూ.6 కోట్ల వ్యయంతో 30 పడకల ఆసుపత్రి నిర్మించడానికి వీలుగా ఈ నెల 2న వేల్పూరులో శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఊరికి దూరంగా ఉండటంతో వేల్పూరు గ్రామస్తులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కంటే తణుకు దగ్గర ఉందని తణుకు ఆసుపత్రులకు వస్తున్నారు. ఈ క్రమంలో తణుకు పంచాయతీ స్థలం ప్రధాన సెంటర్‌లో ఎకరం విస్తీర్ణంలో ఉండటంతో దానిలో నిర్మించేలా గతంలోనే తీర్మానం చేసి దానికి అనుగుణంగా శంకుస్థాపన చేశారు. అయితే 2018లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆరిమిల్లి సామాజిక వర్గానికి చెందిన కొందరు అదే ఎకరంలో రూ.25 లక్షల వ్యయంతో ఐదు షాపులు నిర్మించేలా తీర్మానం చేశారు. ఊరు ప్రధాన సెంటర్‌లో ఆసుపత్రి ఉంటే ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తే సౌకర్యాలు మెరుగవుతాయని, షాపుల ద్వారా ఐదుగురికి ప్రయోజనం దక్కేకంటే ఆసుపత్రి ద్వారా ఊరంతా ఉపయుక్తంగా ఉంటుందని గ్రామస్తులతో మాట్లాడి అందరి ఆమోదంతో శంకుస్థాపన చేశారు. దీంతో ఇక్కడ ఆసుపత్రి నిర్మించడానికి వీల్లేదని గతంలో ఐదు షాపులు నిర్మించడానికి పంచాయతీ తీర్మానం చేసిందని ఆరిమిల్లి సామాజికవర్గానికి చెందిన ఐదుగురు వార్డు సభ్యులు హైకోర్టులో పిటీషన్ దాఖలు చేయడంతో వివరణ ఇవ్వాలంటూ అధికారులకు నోటీసులు అందాయి. దీనిపై గ్రామంలో తీవ్ర చర్చ సాగుతుంది.

బీసీ కమ్యూనిటీ భవనాల విషయంలో కూడా..

గతంలోనూ ఇదే వేల్పూరులో రజక, నాయీబ్రాహ్మణ, అగ్నికుల క్షత్రియ, టైలర్లు, తాపీసంఘ పనివార్ల భవనాలకు భూమి కేటాయించి శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించిన తరువాత టీడీపీ పంచాయతీ సభ్యులతో కోర్టులో కేసులు దాఖలు చేయించారు. ఇది తీవ్ర వివాదానికి దారితీయడం, బీసీలు ఇతర సామాజిక వర్గాలు రిలే నిరాహారదీక్షలు నిర్వహించి ఆరిమిల్లి నియంతృత్వపోకడలపై గళం వినిపించడంతో వెనక్కి తగ్గి కోర్టులో కేసులు విత్‌డ్రా చేసుకోవడంతో కొన్ని నెలల పాటు నిలిచిపోయి పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి.

నాడు బీసీల భవన్ పేరు మార్పి

ఆరిమిల్లి రాధాకృష్ణ తనకు బీసీలంటే ప్రేమని నిత్యం చెబుతూ.. చేష్టలు మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటాయి. 2011లో అప్పటి ఎమ్మెల్యే కారుమూరి నాగేశ్వరరావు బీసీ వర్గాలకు ఒక సామాజిక భవనాన్ని నిర్మించి అప్పగించి నిర్మాణం పూర్తయిన తరువాత దానికి మహాత్మా జ్యోతిరావుపూలే భవనానికి పేరు పెట్టారు. 2014లో ఎమ్మెల్యే అయ్యాక ఆరిమిల్లి కన్ను జ్యోతిరావుపూలే భవన్‌పై పడింది. 2018లో ఎన్టీఆర్ భవన్‌గా పేరు మార్చడంపై అప్పట్లోనూ బీసీ సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. ఎన్టీఆర్ అంటే బీసీలైన మాకు అభిమానం ఉన్నప్పటికీ మా కుల భవనాలకు మా పేరు పెట్టుకోవడమే న్యాయమని కొద్దిరోజులు పాటు నిరసన తెలిపారు. మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక జ్యోతిరావుపూలే భవనంగా పేరు మార్చారు. ఉదయం పూట సమావేశాలు, సభల్లో బీసీలే వెన్నుదన్ను అని మాట్లాడటం, రాత్రి పూట ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యంగా సొంత సామాజికవర్గం కోసం పనిచేయడంపై నియోజకవర్గంలో హాట్‌టాపిక్‌గా మారింది.

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తల
నియామకం

- ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్తగా కారుమూరి సునీల్ కుమార్ యాదవ్
- చింతలపూడి అసెంబ్లీ సమన్వయకర్తగా కంభం విజయరాజు



కారుమూరి సునీల్ కుమార్ యాదవ్



కంభం విజయరాజు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: వైఎస్సార్ సీపీ పార్లమెంట్, అసెంబ్లీ సమన్వయకర్తలను ప్రకటించారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా రవాణా శాఖ మాజీ అధికారి కంభం విజయరాజును నియమించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కార్యాలయం ఈ మేరకు ప్రకటన జారీ చేసింది. ఏలూరు ఎంపీగా ప్రస్తుతం కోటగిరి శ్రీధర్ కొనసాగుతున్నారు. చింతలపూడి ఎమ్మెల్యేగా వీఆర్ ఎలీజా కొనసాగుతున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులను ఖరారు చేసి ప్రకటించారు. కారుమూరి సునీల్‌కుమార్ కారుమూరి సేవాసమితి పేరుతో గత ఆరు నెలల కాలంలో 20 గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. లండన్‌లో ఉన్నత విద్య పూర్తి చేశారు. జెడ్పీ చైర్మన్‌గా కారుమూరి పనిచేసిన క్రమంలో ఏలూరు పార్లమెంట్‌లో విస్తృత పరిచయాలు ఉండటంతో అభ్యర్థిగా సునీల్‌కుమార్‌ను ఎంపిక చేశారు. చింతలపూడి సమన్వయకర్త, అభ్యర్థిగా రవాణాశాఖ ఎంవీఐ కంభం విజయరాజును నియమించారు. ఇటీవలే వీఆర్‌ఎస్ తీసుకున్న విజయరాజు వైఎస్సార్ సీపీలో చేరారు. చింతలపూడి నియోజకవర్గం స్వస్థలం కావడం, అలాగే గతంలో చింతలపూడిలో మోటారువెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన క్రమంలో ఆయనకు విస్తృత పరిచయాలు ఉన్నాయి.

జగనన్న తోడుతో చిరు వ్యాపారుల్లో ఆత్మగౌరవం

- పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి
- జగనన్న తోడు లబ్ధిదారులకు చెక్కుల అందజేత



జగనన్న తోడు చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): జగనన్న తోడు పథకం ద్వారా ఇస్తున్న రూ.10 వేల రుణం ద్వారా చిరు వ్యాపారుల్లో ఆత్మ గౌరవాన్ని పెంచుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. గురువారం వరుసగా 8వ విడత జగనన్న తోడు వడ్డీ లేని రుణాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, అధికారులు, లబ్ధిదారులు వర్చువల్‌గా తిలకించారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చిరు వ్యాపారుల ఆర్థిక అభివృద్ధికి జగనన్న తోడు ఎంతో ఆసరాగా ఉంటుందని, సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు ద్వారా చిరు వ్యాపారులకు ఆర్థిక భరోసా ఇచ్చే క్రమంలో అండగా నిలవడమే కాకుండా, సకాలంలో చెల్లించిన వారికి వడ్డీ రీయింబర్స్‌మెంటు నేరుగా జమచేయడం జరిగిందన్నారు. చిరువ్యాపారులు అందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతివృత్తుల వారు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి వడ్డీ రీయింబర్స్‌మెంటు పొందాలన్నారు. అర్హులైన వారు వడ్డీ లేని రుణాల కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేయాలన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో వడ్డీ రాయితీ క్రింద 30,077 మంది చిరు వ్యాపారుల ఖాతాల్లో నేడు వడ్డీ రీయింబర్స్‌మెంటు కింద రూ.78,61,023 జమ చేయడం శుభ పరిణామం అని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. 8వ విడత జగనన్న తోడు 30,077 మందికి రూ.78.61 లక్షలు నమూనా చెక్కును కలెక్టరు పి.ప్రశాంతి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, జిల్లా వార్డు, గ్రామ గ్రామ సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ ఎస్‌వీఎస్ ప్రసాద్‌యాదవ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. డి.మహేశ్వరరావు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాదు, డీపీఎం కె.శ్రీనివాస్, సిటీ మిషన్ మేనేజరు సీహెచ్ నానిబాబు, పట్టణ సమైఖ్య అధ్యక్షురాలు సీహెచ్ కృపారాణి పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు అంబేడ్కర్

- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి
- అంబేడ్కర్ జీవిత చరిత్రపై ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం



అంబేడ్కర్ జీవిత విశేషాలు తెలిపే ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం (ప్రకాశం చౌక్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశ ప్రజలందరికీ ఆదర్శనీయుడని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సామాజిక సమతా సంకల్పం (జన్ బాగీదరి) కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ జీవిత చరిత్రపై సాంఘిక సంక్షేమ సాధికారత శాఖ గురువారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో అంబేడ్కర్ జీవితంపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. తొలుత కలెక్టరేట్ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి, సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ సామాజిక న్యాయంపై ప్రజలలో అవగాహన తీసుకురావడానికి గత నాలుగు రోజులుగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించడానికి మనమంతా పునరంకితం కావాలన్నారు. జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకట రమణ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి బి.గణపతిరావు, జిల్లా ట్రైబల్ అధికారి డి.పుష్పరాణి పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



భీమవరం ట్రెజరీ కార్యాలయంలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ జిల్లా ఖజానా కార్యాలయంలో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువును జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభించి ఖజానా కార్యాలయ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి సంప్రదాయం ఉట్టిపడేలా వేడుకగా జిల్లా ట్రెజరీ అధికారి ఆడారి గణేష్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించడాన్ని ప్రశంసించారు. కోలం ముగ్గులను, బొమ్మల కొలువును అలంకరణలను పరిశీలించి చాలా బాగుందని కితాబ్ ఇచ్చి, ఈ అలంకరణలో పాల్గొన్న మహిళా సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు వారి అతి పెద్ద పండుగ సంక్రాంతి అని, కుటుంబ సభ్యులందరూ పండగ రోజుల్లో ఒక చోట చేరి ఆనందోత్సాహాలతో సంప్రదాయబద్ధంగా జరుపుకునే పండుగ సంక్రాంతి అన్నారు. బుద్ధిని వృద్ధి చేసుకోవడం అనేది సంక్రాంతి పండుగ లోని ఆంతర్యం అన్నారు. జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సంక్రాతి పండుగను పురస్కరించుకుని మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజులు పాటు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రంగవల్లులు, పువ్వులతో కార్యాలయాన్ని అలంకరించటం, బొమ్మల కొలువు, భోగి మంట, చెరుకు గెడలు, పూర్ణకలశాలు, ధాన్యపు కంకులు, రేగిపండ్లు మొదలైన వాటితో సంక్రాంతి శోభను తీర్చిదిద్దారు. జిల్లా ట్రెజరీ సభ్యులందరికి 'ఖేలో ఖజానా' పేరుతో ఆటల పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం సంక్రాంతి వంటలైన క్షీరాన్నం, కొబ్బరి అన్నం, పులిహోర, పెరుగు ఆవడ, అరిసెలు, బూరెలు, గారెలు, బొబ్బట్లు, కాజాలు, సున్నుండలు, లడ్డూలు పూతరేకులు, కజ్జికాయలు, జంతికలు, అప్పడాలు, ఉలవచారు, పచ్చిపులుసు, రోటి పచ్చడి మొదలైన పిండివంటలను సిబ్బంది తయారుచేసి ఆహుతులకు సంక్రాంతి విందును ఏర్పాటు చేశారు. తదుపరి క్రీడా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ప్రత్యేక ఆహ్వానితులుగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, డీపీఆర్‌ఓ టి.నాగేశ్వరరావు, డీఎల్‌డీవో కేసీహెచ్ అప్పారావు తదితర అధికారులు పాల్గొని తిలకించారు. జిల్లా ట్రెజరీ అధికారి ఆడారి గణేష్, సహాయ ట్రెజరీ అధికారి అబ్దుల్ హకీం, ఎస్‌టీఓలు జె. రామారావు, ఇ.హిమబిందు, ఎ.రవివర్మ, పి.హరిబాబు, ఏపీ శివాజీ, ట్రెజరీ అసోసియేషన్ అధ్యక్షులు యూవీ పాండురంగారావు సీనియర్ అకౌంటెంట్లు జె.మౌనిక, జ్యోతి పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక.. సంక్రాంతి

- ఏలూరులో ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి సంక్రాంతి సంబరాలు
- 10 మంది కవులకు విశిష్ట సాహిత్య పురస్కారాల ప్రదానం
- ఒక్కొక్కరికి రూ.10 వేల నగదు బహుమతుల అందజేత
- భాగస్వాములైన కవులు, కళాకారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు



పండితులను సత్కరిస్తున్న ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబం సంక్రాంతి పండుగ అని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ, ఏలూరు జిల్లా ప్రభుత్వ యంత్రాంగం, వైఎంహెచ్‌ఏ సంయుక్త ఆధ్వర్యంలో వైఎంహెచ్‌ఏ హాలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి సంబరాలను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తెలుగువారు కుటుంబ సమేతంగా కలిసి చేసుకునే ప్రత్యేకమైన సంక్రాంతి పండుగను నూతన సంవత్సరంలో మొదటి పండుగగా మూడు రోజులపాటు ఆనందోత్సాహాలతో జరుపుకోవడం ఆచారంగా కొనసాగుతోందన్నారు. రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో సాహిత్య రంగానికి ఆదరణ కరువవుతున్న తరుణంలో ఆ రంగానికి ప్రభుత్వం చేయూత ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారన్నారు. సీఎం ఆదేశాల మేరకు రాష్ట్రస్థాయిలో సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఎంతో వైభవంగా నిర్వహించడానికి కవులు, కళాకారులకు పుట్టిల్లు అయిన ఏలూరును వేదికగా ఎంచుకున్నామన్నారు. ప్రతి సాహితీవేత్త, ప్రతి కళాకారుని కుటుంబంలో ఈ పండుగ కొత్త కాంతులు తీసుకువచ్చే విధంగా వారికి గుర్తింపుతో పాటు నగదు పురస్కారాలతో సత్కరించి పండుగను మరింత శోభాయమానంగా చేస్తున్నామన్నారు. భవిష్యత్‌లో సాహిత్య మండలి ఆధ్వర్యంలో ఔత్సాహిక సాహితీవేత్తలను గుర్తించి ప్రోత్సహించేలా విభిన్న కార్యక్రమాలకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. తొలుత భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల హరినామ సంకీర్తనలు, సంక్రాంతి ముగ్గులు, గాలిపటాలు, తెలుగు సంప్రదాయ దుస్తులు ధరించిన బాలలు ప్రదర్శించిన కోలాటం, కూచిపూడి, భరత నాట్య ప్రదర్శన, కార్యక్రమాలు పండుగ వైభవాన్ని ప్రస్ఫుటించాయి. అనంతరం సాహితీ రంగంలో విశేష కృషి చేసిన 10 మంది కవులను ఎంపిక చేసి వారికి జేసీ లావణ్యవేణి చేతుల మీదుగా విశిష్ట సాహిత్య పురస్కారాలతో సత్కరించి రూ.10 వేల నగదు బహుమతి అందించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి ఎంపిక చేసిన కవులను సత్కరించి వారికి రూ.5 వేల నగదు పురస్కారం అందజేశారు. అలాగే సాహిత్య రంగానికి విశేష సేవ చేస్తున్న సాహిత్య సంస్థల నిర్వాహకులకు సైతం రూ. 5 వేల నగదు పురస్కారాలతో సత్కరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జేసీ బీ.లావణ్యవేణి, ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి పాల్గొన్నారు.

జిల్లాలో సత్కారం అందుకున్న కవులు వీరే

వేమూరి శ్రీనివాస్ (పశ్చిమగోదావరి), యండపల్లి పాండురంగారావు (పశ్చిమగోదావరి)

నగదు బహుమతి పొందిన సాహితీవేత్తలు వీరే

బోయి హైమావతి భీమన్న, డాక్టర్ యనమదల మురళీకృష్ణ, కత్తిమండ ప్రతాప్‌కుమార్, నల్లాని రాజేశ్వరి, డాక్టర్ పతికి రమేష్ నారాయణ, కొల్లి రమావతి, శ్రీనివాస్ వాసుదేవ్, అవధానుల మణిబాబు, డాక్టర్ రాసాని, మంగళగిరి ప్రసాదరావు.

పురస్కారాలు పొందిన సాహిత్య సంస్థలు ఇవే..

శ్రీ కృష్ణదేవరాయ కళావేదిక గుంటూరు, హేలాపురి కల్చరల్ అసోసియేషన్, పశ్చిమగోదావరి జిల్లా రచయితల సంఘం, ఫైన్‌ఆర్ట్స్ అకాడమి ఏలూరు, సాహిత్య మండలి ఏలూరు.

క్లుప్తంగా

వైభవంగా తిరువీధి సేవ



తొళక్క వాహనంపై ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. నిత్యం ఉదయం వేళ శ్రీవారికి నిర్వహిస్తున్న తిరువీధి సేవ భక్తులకు కనువిందు చేస్తోంది. గురువారం క్షేత్ర వీధుల్లో తిరువీధి సేవను నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించిన తొళక్క వాహనంపై ఉంచి, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, అశ్వ, గజ సేవల మధ్య ఈ తిరువీధి సేవ అట్టహాసంగా సాగింది. తమ ఇంటి ముంగిటకు వచ్చిన స్వామి, అమ్మవార్లకు పెద్ద ఎత్తున భక్తులు నీరాజనాలు సమర్పించి, హారతులు పట్టారు. గుడిసెంటర్‌కు చేరుకున్న స్వామి, అమ్మవార్లకు అక్కడి ధనుర్మాస మండపంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

కారు ఢీకొని దంపతుల మృతి





త్సవటపల్లి రాటాలు, అమ్మాజీ మృతదేహాలు

ఏలూరు టౌన్: ఏలూరు జాతీయ రహదారిపై టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తున్న దంపతులను గురువారం కారు ఢీకొట్టడంతో సంఘటనా స్థలంలోని మృతి చెందారు. ఈ ఘటనపై పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం పెదవేగి మండలం ముండూరు పంచాయతీ నడిమిగూడెం ప్రాంతానికి చెందిన త్సవటపల్లి రాటాలు (55), భార్య త్సవటపల్లి అమ్మాజీ (45) ఇద్దరూ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారిద్దరూ గురువారం దుగ్గిరాల గ్రామానికి వ్యక్తిగత పనులపై వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం టీవీఎస్ మోపెడ్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా ఏలూరు జాతీయ రహదారిపై రత్నాస్ దాబా వద్దకు వచ్చేసరికి విజయవాడ నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళ్తున్న కారు అతివేగంగా వస్తూ అదుపుతప్పి మోపెడ్‌ను ఢీకొట్టింది. ఈ రోడ్డు ప్రమాదంలో రాటాలు, అతని భార్య అమ్మాజీ అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఏలూరు రూరల్ ఎస్‌ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



చేబ్రోలు జగనన్న కాలనీలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

● సొంతింట.. సంక్రాంతి వేడుక



చిన్నారులకు భోగిపళ్లు పోస్తున్న దృశ్యం



వైఎస్సార్ కాలనీ ఆర్చి వద్ద నృత్యాలు చేస్తున్న చిన్నారులు

ఈ దృశ్యాలు చూశారా? ఉంగుటూరు మండలం చేబ్రోలు జగనన్న కాలనీలో గురువారం నిర్వహించిన సంక్రాంతి ఉత్సవాల చిత్రాలివీ. ఎన్నో ఏళ్లగా సొంతింటి కోసం ఇబ్బందిపడుతున్న సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సొంతింటి స్థలం కేటాయించి ఇంటి నిర్మాణాలకు అండగా ఉంది. ఇటీవల జగనన్న కాలనీలో వైభవంగా గృహ ప్రవేశం చేసిన వీరు గురువారం వైభవంగా సంక్రాంతి ఉత్సావాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు.

– ఉంగుటూరు

రేపటి నుంచి మావుళ్లమ్మ వార్షికోత్సవాలు

- 28 రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ
- ఫిబ్రవరి 9న భారీ అన్న సమారాధన



మావుళ్లమ్మ



సమావేశంలో ఉత్సవాల బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణ ఇలవేల్పు భీమవరం మావుళ్లమ్మ 60వ వార్షికోత్సవాలు శనివారం నుంచి 28 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు సంబంధించి దాదాపు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి ఉత్సవాలను నీరుల్లి కూరగాయపండ్లు వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ, దేవస్థానం సంయుక్తంగా నిర్వహిస్తుంది. ఇప్పటికే అమ్మవారి దేవస్థానం వద్ద చలువ పందిళ్లు వేశారు. క్లాత్ డెకరేషన్ పూర్తి చేశారు. అమ్మవారి ఉత్సవాల్లో ప్రత్యేకంగా నిలిచే లైటింగ్ ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి.

రోజుకు 10 వేల మందికి దర్శనం

అమ్మవారి ఉత్సవాల 28 రోజులల్లో రోజుకు 10 వేలకు పైనే భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి దేవస్థానం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో క్యూలైన్లు ఏర్పాటు చేసి ఆ క్యూలైన్లు ద్వారా భక్తులు ఇబ్బందులు లేకుండా దర్శించుకునే సౌకర్యం కల్పించారు.

లక్ష మందికి అన్నసమారధన

అమ్మవారి ఉత్సవాల్లో చివరి ఘట్టం అన్నదానం. ఏటా అమ్మవారి ఉత్సవాల ముగింపు రోజున సుమారు లక్ష మందికి అమ్మవారి ప్రసాదాన్ని అన్నదానం రూపంలో వితరణ చేస్తారు. అలాగే ఉత్సవాల నిర్వాహికులైన నీరుల్లికూరగాయ పండ్లు వర్తక సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను తిలకించడానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ప్రతి రోజూ అన్నదానం చేస్తారు.

కార్యక్రమాల నిర్వహణ ఇలా

మావుళ్లమ్మ అమ్మవారి 60వ వార్షికోత్సవ మహోత్సవాల వివరాలను గురువారం విలేకరుల సమావేశంలో నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు. శనివారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించి, సాయంత్రం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఉత్సవాలను ప్రారంభిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 9న భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే 20 పౌరాణిక నాటకాలు, 4 బుర్రకథలు, 7 హరికథలు, 13 మ్యూజికల్ నైట్స్, 13 కూచిపూడి నృత్యా ప్రదర్శనలు నిర్వహిస్తున్నమని తెలిపారు. అనంతరం ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటి సభ్యులు తుటారపు ఏడుకొండలు, రామాయణం గోవిందరావు, కొప్పుల సత్తిబాబు, రామాయణం చిన్నారి, కట్టా కొండ, నరహరిశెట్టి సూర్యనారాయణ, రామాయణం శ్రీనివాసరావు, మానే తేజ, అప్పన రామకృష్ణ, ఆకుల సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

మావుళ్లమ్మ 60 వార్షిక ఉత్సవాల నేపథ్యంలో గురువారం భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్ ఏర్పాట్లును పరిశీలించారు. అమ్మవారి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన పందిళ్లు, డెకరేషన్లు, క్యూలైన్లు, దేవస్థానంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. అలాగే దేవస్థానం బయట పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను, ట్రాఫిక్ సీఐ దాసు, ఏఎస్సైలు దాలయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ పోలీసులు

తణుకు : పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం దిగుమతి చేసుకుని స్థానికంగా విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో గురువారం తణుకు రూరల్ పోలీసులు ఓ ఇంటిపై దాడి చేశారు. మండంలోని వేల్పూరు గ్రామానికి చెందిన అయిశెట్టి పాపారావు ఇంట్లో గోవా రాష్ట్రానికి చెందిన 25 ఫుల్ బాటిళ్లు, 8 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్, సీఐ సీహెచ్ ఆంజనేయులు ఆధ్వర్యంలో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపారు.

గుంటూరు వెళ్లి పింఛన్ అందజేత



గుంటూరు ఆస్పత్రిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పొలిమేర వేణుగోపాల్

వీరవాసరం: అనారోగ్యంతో గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పంజావేమవరం గ్రామానికి చెందిన వాకల రామకృష్ణకు వలంటీర్ పొలిమేర వేణుగోపాల్ పింఛన్ అందజేశారు. వాకల రామకృష్ణకు వైఎస్సార్ పింఛన్ కానుకలో కొత్తగా పింఛన్ మంజూరైంది. అయితే రామకృష్ణ అనారోగ్యానికి గురై గుంటూరు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బీజేపాలెం సచివాలయ వలంటీర్ వేణుగోపాల్ రెండు రోజుల క్రితం గుంటూరు వెళ్లి ఐసీయూలో చికిత్స పొందుతున్న రామకృష్ణకు పింఛన్ అందజేశారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ముదినేపల్లి రూరల్: ఒంటరిగా నివసిస్తున్న మహిళ మెడలో గొలుసును ఓ దుండగుడు చోరీ చేసిన ఘటన మండలంలోని సింగరాయపాలెంలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామానికి శివారు గ్రోవెల్ పరిశ్రమ సమీపంలో బొంగు సింహాచలమ్మ ఒంటరిగా నివాసం ఉంటుంది. బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగుడు మంచినీరు ఇవ్వమని అడిగి, ఈలోపు సింహాచాలమ్మ మెడపై ఉన్న గొలుసు లాక్కొని ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు. ఈ మేరకు బాధితురాలు గురువారం పోలీసులను ఆశ్రయించింది.

కనుమ ఉత్సవానికి శరవేగంగా ఏర్పాట్లు



దొరసానిపాడులో ముస్తాబైన కనుమ మండపం

ద్వారకాతిరుమల: కనుమ నాడు కాకైనా కదల దన్నది నానుడి. కానీ ఆరోజు శ్రీ వారు క్షేత్రం విడిచి పొరుగు గ్రామానికి వెళ్తారు. అదే ఇక్కడ విశిష్టత. ఏడాదిలో ఒకసారి మాత్రమే ఈ తంతు జరుగుతుంది. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ మరుసటి రోజు కనుమ నాడు కనుమ ఉత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. అందులో భాగంగానే ఈనెల 16న కనుమ పండుగను పురస్కరించుకుని ఈ వేడుకను వైభవంగా జరిపేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే కనుమ మండపాన్ని, పరిసర ప్రాంతాలను రంగులు, విద్యుద్దీప తోరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పండుగ నాడు మధ్యాహ్నం స్వామివారు ఉభయ దేవేరులతో రాజాదిరాజ వాహనంపై ఆలయం నుంచి బయలుదేరి దొరసానిపాడు గ్రామానికి వెళ్తారు. అక్కడ గ్రామ ప్రజలు కనుమ అయినప్పటికీ మాంసాహారాన్ని ముట్టకుండా, ఎంతో నియమనిష్ఠలతో స్వామి వారికి అడుగడుగునా బ్రహ్మరథం పడతారు. ఈ సందర్భంగా స్వామివారి వాహనం భక్తుల గోవింద నామ స్మరణల నడుమ కనుమ మండపం వద్దకు చేరుకుంటుంది. అక్కడ మండపంలో శ్రీవారు, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆ తరువాత తిరిగి శ్రీవారు గిరి ప్రదక్షిణగా ఆలయానికి చేరుకుంటారు. ఈ వేడుకలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు కోరారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ

గురువారం నుంచి విధుల్లోకి కార్మికులు



గురువారం తెల్లవారుజామున సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటిస్తున్న బి.సోమయ్య

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ కార్మికులు 16 రోజులుగా చేస్తున్న సమ్మెను విరమించి గురువారం నుంచి విధుల్లోకి చేరారు. కార్మికుల సమస్యలపై బుధవారం రాత్రి ప్రభుత్వంతో జరిపిన చర్చలు కొలిక్కిరావడంతో కార్మికులు సమ్మెను విరమించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య గురువారం తెల్లవారు జామున సమ్మె శిబిరాన్ని సందర్శించి కార్మికులకు అభినందనలు తెలియజేశారు. 16 రోజుల సమ్మె ఫలితంగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు.అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ కార్మికులు, చెత్త వాహనాల డ్రైవర్లు, మలేరియా విభాగం వర్కర్లకు, విలీన పంచాయతీల కార్మికులకు రూ.6 వేలు చొప్పున జీతాల పెంపుదలకు అంగీకారం తెలిపారన్నారు. కార్మికులు మరణిస్తే దహన సంస్కారాల ఖర్చు రూ.15 వేల నుండి రూ.20 వేలకు పెరిగిందని తెలిపారు. మొదటి సారిగా రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.75 వేలు పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. సమ్మె కాలపు వేతనాలు పండుగ బహుమతి, పర్మినెంట్ సిబ్బందికి సరెండర్ లీవులు సాధించుకున్నామని తెలిపారు. పబ్లిక్ హెల్త్ విభాగం వారికి రెండు భాగాలుగా ఇస్తున్న వేతనం, హెల్త్ అలవెన్స్‌లు రూ.21 వేలు చేయడం వల్ల రానున్న వేతన పెంపకాల్లో కార్మికులకు మేలు జరిగే అవకాశం ఉందన్నారు. సమ్మె విరమణ సభకు యూనియన్ జిల్లా అధ్యక్షులు లావేటి కృష్ణారావు అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి ఎ.జానుబాబు పాల్గొన్నారు

జీవోలను విడుదల చేయాలి

మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులతో, మంత్రివర్గం, మున్సిపల్ అధికారులతో జరిపిన చర్యలు ఫలించడంతో మున్సిపల్ కార్మికులు సమ్మెను విరమించి విధులకు హాజరవుతున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, యూనియన్ ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు తెలిపారు. అంగీకారం కుదిరిన అంశాలకు సంబంధించి తక్షణమే అమలు జీఓలను విడుదల చేయాలని కోరారు.

రైలు కింద పడి వృద్ధుడి ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్/యలమంచిలి: పాలకొల్లు పట్టణ రైల్వేస్టేషన్ పరిధిలో రైల్వే ట్రాక్ శివారు ప్రాంతంలో ఉల్లి రామారావు (70) అనే వ్యక్తి గురువారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. పట్టణంలోని లజపతిరాయ్‌పేట 5వ వీధిలో నివాసం ఉంటున్న రామారావు భార్య ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందింది. ఇతనికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య చనిపోయిన నాటి నుంచి మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడని మృతుని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. భీమవరం రైల్వే ఎస్సై టీటీవీ రమణ ఆధ్వర్యంలో నరసాపురం కానిస్టేబుల్ వి.బ్రహ్మానందరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కౌన్సెలింగ్ ఇచ్చినా...

అయితే ఉల్లి రామారావు గురువారం ఉదయం చించినాడ వంతెనపై నుంచి గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకోబోయాడు. ఈ విషయాన్ని గమనించిన యలమంచిలి ఎస్సై కాకి శివన్నారాయణతో పాటు సిబ్బంది రక్షించారు. చించినాడ వంతెన వద్ద ఉన్న పోలీస్ పికెట్‌ను గురువారం ఎస్సై శివన్నారాయణ సందర్శించారు. అక్కడ పెట్రోలింగ్ పోలీసులతో మాట్లాడుతుండగా వృద్ధుడు రామారావు వంతెన ఫుట్‌పాత్‌పై నుంచి నడుచుకుంటూ ముందుకు వెళ్లారు. పికెట్‌కు కూత వేటు దూరంలో అతను రెయిలింగ్ ఎక్కుతుండగా ఎస్సైతో పాటు సిబ్బంది హుటాహుటిన పరుగెత్తుకుని వెళ్లి అతన్ని రక్షించారు. తనను తన సంతానం పట్టించుకోవడంలేదని అందుకే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు రామారావు పోలీసులకు తెలిపాడు. దీంతో రామారావును పోలీస్ స్టేషన్‌కి తీసుకువెళ్లి అతని కుమారుడిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అతని కుమారుడి నుంచి తండ్రిని సక్రమంగా చూసుకుంటామని హామీ పత్రం రాయించుకుని రామారావును కుమారులకు అప్పగించారు. అయితే రాత్రి సమయంలో రామారావు ఆత్మహత్య చేసుకున్నాడు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

ఏలూరు (టూటౌన్): భార్యను హత్య చేసిన కేసులో ఆమె భర్తకు జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఏలూరు ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి రామ్ గోపాల్ గురువారం తీర్పు వెలువరించారు. దీనికి సంబంధించి పోలీసులు, ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల ప్రకారం 2020, జూలై 18న గణపవరం మండలం పిప్పర గ్రామంలో చేపల చెరువు వద్ద కాపలా పని చేసే మేడ అబ్బులు (26), తన భార్య సంగాలమ్మ(20)ను మెడకు ఉన్న మంగసూత్రం తాడుతో గట్టిగా బిగించి హత్య చేశాడు. దీంతో మృతురాలి తల్లి చినమ్మ వరలక్ష్మి అల్లుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో అబ్బులు నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శ్రీరామ్ గోపాల్ గురువారం తీర్పును వెలువరించారు.

నకిలీ నోట్ల పేరుతో టోకరా

జంగారెడ్డిగూడెం: నకిలీ నోట్ల ముఠా చేతిలో ఒక యువకుడు మోసపోయాడు. ఈ ఘటనకు సంబంధించి జంగారెడ్డిగూడెం ట్రైనీ డీఎస్పీ బి.విద్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎ.పోలవరం గ్రామానికి చెందిన పసుపులేటి సురేంద్ర కన్నాపురంలో సెల్‌ఫోన్ షాపు నిర్వహిస్తున్నాడు. షాపునకు వచ్చే ఖాతాదారుడి నుంచి నకిలీ నోట్ల ముఠా గురించి తెలుసుకున్న సురేంద్ర, అధిక సొమ్ము సంపాదించాలనే ఆశతో వారితో ఫోన్‌లో మాట్లాడాడు. అయితే నకిలీ నోట్ల ముఠా సభ్యులు రూ.3 లక్షలు ఇస్తే రూ.10 లక్షలు ఇస్తామని నమ్మబలికి , ఈ నెల 3న తాడువాయి గ్రామ శివారుకు రమ్మన్నారు. దీంతో సురేంద్ర, తన స్నేహితులతో కలిసి రూ.2.86 లక్షలు తీసుకుని ఘటనా స్థలానికి వెళ్లగా, అక్కడకు మోటార్ సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చారు. అదే సమయంలో కారులో మరో ఐదుగురు వచ్చి తాము పోలీసులమని పేర్కొంటూ నగదును తీసుకున్నారు. సురేంద్ర వారిని ఐడీ కార్డులు చూపించమని అడుగుతుండగానే వారు కారులో ఉడాయించారు. తిరిగి ఈనెల 10న సురేంద్రకు ఫోన్ చేసి ఈ సంఘటన గురించి ఎవరికైనా ఫిర్యాదు చేస్తే చంపేస్తామని బెదిరించారు. దీంతో బాధితుడు గురువారం పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

ఆకివీడు: స్థానిక వెంకయ్య వయ్యేరు వంతెన సమీపంలో బుధవారం రాత్రి విద్యుత్ షాక్‌తో యువకుడు గొల్లారి దినేష్ (20) మృతి చెందినట్లు ఎస్సై నాగబాబు గురువారం విలేకరులకు చెప్పారు. ఏఎస్సార్ జిల్లాకు చెందిన దుంబ్రి గూడ గ్రామానికి చెందిన దినేష్ గతంలో స్థానికంగా అనాథ శరణాలయంలో పదో తరగతి చదివాడు. ఈ నేపథ్యంలో ఇంటర్ పూర్తి చేసుకుని ఫార్మసీ చదివేందుకు సిద్ధమవుతున్న తరుణంలో పండుగ సెలవులకు తన ఆశ్రయం పొందిన ఆకివీడులోని చర్చికు వచ్చాడు. అయితే చర్చి వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై చనిపోయినట్లు ఎస్సై తెలిపారు. మృతుడు తండ్రి శ్రీరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

అవ్వాతాతల్లో పింఛనోత్సాహం

- ముందే వచ్చిన సంక్రాంతి
- రూ.3వేలు అందుకున్న లబ్ధిదారులు



తణుకు సభలో సీఎంగా జగన్ మళ్లీ రావాలంటూ చేతులెత్తిన పింఛనుదారులు (ఫైల్)



తణుకులో వైఎస్సార్ పెన్షన్ కానుక చెక్కు నమూనాను ఆవిష్కరించిన మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ తదితరులు (ఫైల్)

తణుకు అర్బన్: అవ్వతాతలు, వితంతువులకు ప్రతి నెలా అందిస్తున్న సామాజిక పింఛన్లను రూ. 3వేలకు పెంచుతానని ప్రజాసంకల్పయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేరడంతో పింఛనుదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జనవరి 1వ తేదీ నుంచి పింఛను రూ. 3వేలు చేస్తానని ముందుగానే ప్రకటించడంతో ఆరోజు ఎప్పుడు వస్తుందా అని పింఛనుదారులు ఆశగా ఎదురుచూశారు. చెప్పినట్లుగానే ఈనెల నుంచి రూ. 3వేలు అందచేయడంతో వృద్ధులు, వితంతువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాల్టీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ పెన్షన్ పంపిణీ సభలు నిర్వహించి పింఛనుదారులకు పెన్షన్‌లు అందచేశారు.

నియోజకవర్గంలో రూ. 10.99 కోట్లు పింఛన్ల సొమ్ము పంపిణీ

తణుకు నియోజకవర్గంలో పాత పింఛన్లు 36,881 ఉండగా కొత్తగా 612 పింఛన్లు మంజూరయ్యాయి. ఈనెలలో పాత పింఛన్లతో కలిపి మొత్తం 37,493 మంది పింఛనుదారులకు రూ. 10,99,85,500లు వలంటీర్ వ్యవస్థ ద్వారా అందజేశారు.

నియోజకవర్గంలో పింఛన్లు ఇలా

	రూ.	పింఛన్‌దారులు
తణుకు మునిసిపాలిటీ	8686	2,62,69,500
తణుకు రూరల్	8963	2.60.88.500
అత్తిలి	9688	2,79,92,000
ఇరగవరం	9544	2,77,99,500
నియోజకవర్గంలో కొత్త పింఛన్లు..	612	18,36,000

ఆడిన మాట తప్పని నేత జగనన్న



ప్రజా సంకల్పయాత్రలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛను రూ. 3వేలు ఇస్తానని చెప్పిన హామీ నెరవేర్చి ఆడిన మాట తప్పని నేతగా ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించారు. అదే స్ఫూర్తితో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అర్హత ఉన్న పింఛను రాలేదనేవారు లేకుండా చూసుకోవాలని అధికారులను ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీచేసి అర్హులందరికీ పింఛను అందేలా చేశారు.

– డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు, తణుకు

మాలాంటి పేదలకు మేలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లుగానే పింఛను రూ. 3వేలు చేసి వలంటీరు ద్వారా అందచేయడంతో మాలాంటి పేదలకు ఎంతో మేలుచేశారు. చాలా సంతోషంగా ఉంది. ఈ వయస్సులో పింఛను సొమ్ము మాలాంటి వారికి చాలా బాగా ఉపయోగపడుతుంది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాము.

– కోరా వరలక్ష్మి, తణుకు

జగన్‌బాబు చల్లగా ఉండాలి



నా భర్త లేకపోవడంతో పింఛను మీదే ఆధారపడి జీవిస్తున్నాను. రూ. 3వేలకు పింఛను పెంచడం నాలాంటివారికి ఎంతో ఆసరాగా ఉంటుంది. పిల్లల సంసారాలు వారికే సరిపోవడంతో నేను ఒంటరిగానే నివసిస్తూ హోటల్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. జగన్‌బాబు చల్లగాఉండాలి.

– చామర్తి సౌమిత్రి, తణుకు

క్లుప్తంగా

వరాల వెంకన్నకు విశేష పూజలు



విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ధనుర్మాసం సందర్భంగా అత్తిలి మండలం ఈడూరు గ్రామంలోగల వరాల వెంకటేశ్వర స్వామికి గురువారం తిరుప్పావడ సేవ జరిపారు. గోదాదేవి అమ్మవారికి కూడారై ఉత్సవం నిర్వహించారు. కోనేరు నుంచి తీసుకువచ్చిన పవిత్ర జలాలు, పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ పరిమళ ద్రవ్యాలతో స్వామివారికి అభిషేక పూజలు చేశారు. అమ్మవారికి 108 కలశాలతో పరమాన్నం, స్వామివారికి 50 కిలోల పులిహోర ప్రసాదాన్ని భక్తులు నివేదించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించి, ప్రసాదాన్ని స్వీకరించారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న లయన్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): డైమండ్స్ లయన్స్ హంగర్ రిలీఫ్ కార్యక్రమాల్లో భాగంగా అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని యాగర్లపల్లి ప్రేమాలయంలో పండ్లు, పౌష్టికాహారం, లార్డ్స్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోంలో రైస్ బ్యాగ్‌లు, పడాల వృద్ధాశ్రమంలో అన్నదానం, పేదలకు ఫుడ్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పుత్రయ్య,వెంకటేశ్వరరావు, ఆంజనేయస్వామి, సాయి, మాధురి పాల్గొన్నారు.

అయోధ్యకు ఆహ్వానం



అయోధ్య రామయ్య ఆహ్వానపత్రికను తపోవన మాతాజీకి అందజేస్తున్న దృశ్యం

పెంటపాడు: అయోధ్యలో జరగబోయే శ్రీరామమందిర ప్రాణప్రతిష్ఠ ఆహ్వాన పత్రిక పెనుమంత్ర మార్కండేయ తపోవనం సరస్వతి మాతాజీకి దక్కింది. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 6 వేల మందిలో ప్రముఖులలో మాతాజీకి దక్కిన అరుదైన గౌరవంగా ఆమె ఈ ఆహ్వానపత్రిక అందుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ ఆహ్వాన కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వాసవీ కళాశాలకు ఐఎస్‌ఓ పురస్కారాలు



వాసవీ కళాశాలకు వచ్చిన ఐఎస్‌ఓ పురస్కారాలు అందుకుంటున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: పెదతాడేపల్లిలోని వాసవీ ఇంజనీరింగ్ కళాశాలకు మూడు ఐఎస్‌ఓ పురస్కారాలు లభించినట్టు కళాశాలపాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావులు బుధవారం తెలిపారు. హైద్రాబాద్‌కు చెందిన ప్రముఖ ఐఎస్‌ఓ ఆడిట్ సంస్థ హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య చేతుల మీదుగా కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఈ సర్టిఫికేషన్లను యాజమాన్యం అందుకున్నారు. ఎడ్యుకేషనల్ క్వాలిటీ మేనేజ్‌మెంటు, ఎనర్జీమేనేజ్‌మెంటు, పర్యావరణ సమతుల్యమేనేజ్‌మెంటుకు గాను ఇవి అందుకున్నారు.కళాశాలను అన్ని విభాగాల్లో ఉత్తమంగా నిలపడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని, త్వరలో నాక్ అక్రిడేషన్ కోసం దరఖాస్తు చేస్తున్నామని పాలకమండలి సభ్యులు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరరాజు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు, టెక్నికల్ డైరెక్టర్ చెక్కా అప్పారావు పాల్గొన్నారు.

వేమూరికి సాహిత్య అకాడమీ పురస్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణానికి చెందిన ప్రముఖ కవి, శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాల గణిత శాస్త్ర సహాయ అచార్యులు వేమూరి శ్రీనివాస్‌కు ఏపీ తెలుగు సాహిత్య అకాడమీ వారిచే సాహితీ సేవా పురస్కారం అందుకున్నారు. వేమూరి వివిధ అంశాలపై రాసిన 435 కవితలకు గాను ఏపీ సాహిత్య అకాడమీ, ఏలూరు జిల్లా ప్రభుత్వ యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో వై.ఎం.హెచ్.ఎ హాల్‌లో గురువారం జరిగిన సాహిత్య సంక్రాంతి సంబరాలలో ఈ అవార్డు అందుకున్నారు. సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, బోయి హైమవతిలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని బంగారుగూడెం గ్రామానికి చెందిన దూలపల్లి వెంకట దుర్గాప్రసాద్ వెన్నుముక ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ సందర్భంగా మంజూరైన రూ.2.20లక్షల చెక్కును గురువారం తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో దుర్గాప్రసాద్ తండ్రి శ్రీనివాస్‌కు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వైద్యానికి సైతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం అందజేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బుర్ల సుబ్బలక్ష్మి, మండల సేవాదళ్ చైర్మన్ కొండుబోయిన కృపావరం, చుండ్రు శ్రీనివాస్, మాకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కొండుబోయిన ఏసు టోనీ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఇంజనీర్ మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు అన్నారు. 125 అడుగుల కాంస్య విగ్రహ ఆవిష్కరణ 19వ తేదీన స్వరాజ్ మైదాన్ విజయవాడలో నిర్వహిస్తున్నందున వారోత్సవాలు సందర్భంగా మునిసిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో గురువారం సామాజిక సమత సంకల్పం కార్యక్రమం జరిగింది. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజనీర్ మురళీకృష్ణ మాట్లాడుతూ సమాజంలో అసమానతలపై తుది శ్వాస విడిచే వరకు పోరాటం చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. నాయకులు తెన్నేటి జగజ్జీవన్, మెరిపో జాన్‌రాజు, కళింగ లక్ష్మణ్, కర్రి నాగేశ్వరరావు, పట్నాల గణపతి, తాడికొండ వాసు, వర్తనపల్లి కాశీ, కేసాని ఆశోక్, కార్మికులుపాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక వికాసం



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

తాడేపల్లిగూడెం రూరల్: క్రీడల ద్వారా మానసిక వికాసం కలగడంతో పాటు విద్యపై మరింత దృష్టి సారించడానికి అవకాశం కలుగుతుందని జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక అన్నారు. గురువారం మండలంలోని పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలోనూ, మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించారు. మొత్తం 35 టీమ్‌లు హాజరయ్యాయి. సర్పంచ్ చంద్రిక మాట్లాడుతూ శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. క్రీడల ద్వారా మానసిక వికాసం కలగడంతో పాటు విద్యపై మరింత దృష్టి సారించడానికి అవకాశం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలకు సమ ప్రాధాన్యతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉండ్రాజవరపు రాజు, పీఈటీలు పి.చంద్రశేఖర్, కే.వెంకటేశ్వరరావు, బి.చంద్రశేఖర్, ఆర్.శివలీల, ఎం.సురేష్, గంగాధర్, ఎ.నాగార్జునరావు, ఎం.సాయి హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాల్‌బహదూర్ శాస్త్రి జీవితం ఆదర్శనీయం



లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మాజీ దేశ ప్రధాని, భారతరత్న లాల్‌బహదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని లాల్ బహదూర్ శాస్త్రి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెద తాడేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతిని నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పాబోలు వెంకటేశ్వరరావు, సభ్యులు పి.మల్లిఖార్జునరావు, బచ్చు విశ్వనాథం, పసుమర్తి కృష్ణారావు, పచ్చిపులుసు అప్పారావు, మండవల్లి హనుమంతరావులు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో శాస్త్రి సాగించిన పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్‌కే.లాల్‌బీబీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



1980-83 నాటి పూర్వ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నాలుగు దశాబ్దాలు క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులందరూ ఒకే వేదికపై కలుసుకున్నారు. ఒకరి జ్ఞాపకాలు ఒకరు పంచుకున్నారు. 1980-83లో పెంటపాడు డీఆర్ గోయెంకా డిగ్రీ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం తాడేపల్లిగూడెం పట్టణం చిన్నతాడేపల్లిరోడ్డులో గురువారం ఉదయం జరిగింది. ఇరు రాష్ట్రాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు, కుటుంబ సమేతంగా వచ్చి సందడి చేశారు. ఆనాడు చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బడేటి నాగేశ్వరరావు, వీర్ల వేణుగోపాల్, మద్దుల మల్లేశ్వరరావు, పసల రామన్న, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొల్లి రమావతికి రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు



విశిష్ట పురస్కారం అందుకుంటున్న కొల్లి రమావతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రముఖ రచయిత్రి, కవయిత్రి, శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతికి ఏపీ సాహిత్య అకాడమీ విశిష్ట పురస్కారం దక్కింది. వివరాలను గురువారం పట్టణంలో వెల్లడించారు. సాహిత్య, సామాజిక రంగాల్లో బహుముఖ సేవలు అందిస్తున్న సందర్భంగా రమావతికి ఏలూరు వై.ఎం.హెచ్.ఎ హాల్‌లో గురువారం జరిగిన సాహిత్య సంక్రాంతి సంబరాల్లో అవార్డుతో పాటు రూ.10 వేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెకంటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, రచయిత్రి బోయి హైమవతి, సంస్కృతి సమితి సీఈఓ మల్లిఖార్జునరావులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముని అక్షింతల పంపిణీ



పెంటపాడు శివాలయం నుంచి అయోధ్య రాముని అక్షింతల శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికీ అయోధ్య రాముని అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పెంటపాడు పెద్ద శివాలయం వద్ద కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. రావిపాడు, రామచంద్రపురం, అలంపురం, ఆకుతీగపాడు, కె. పెంటపాడు, విప్పర్రు తదితర గ్రామాల్లో అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లమిల్లి అంజిరెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కరరెడ్డి, దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యుడు నల్లమిల్లి గాంధీరెడ్డి, సుధా శ్రీనివాసరెడ్డి, వార్డు సభ్యులు బస్సుల రెడ్డి, బీజేపీ నాయకులు కర్రి గిరిష్‌రెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పెంటపాడు: ఉద్యోగ సంఘాలు, ప్రభుత్వ విధులను ప్రత్యేక భాధ్యతగా నిర్వర్తిస్తేనే వారికి ప్రత్యేక గుర్తింపు సాధ్యమని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా గురువారం ఆ సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. మేడ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్, సంఘ సభ్యులు సీహెచ్ ప్రియంక, జిల్లా నాయకులు కొడవటి వెంకటేశ్వర్లు, కండెల్లి శ్రీనివాసరావు, గెద్దం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సంక్రాంతి సంబరాల్లో భాగంగా బ్రాహ్మణ సేవా పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ గాయత్రి కల్యాణ మండపం వద్ద గురువారం మహిళలకు ముగ్గుల పోటీలు, వంటల పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రవా శ్రీనివాస్ మాట్లాడుతూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన సంక్రాంతి సంబరాలు సభ నిర్వహించడంతో పాటు విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

మంత్రి కారుమూరి ప్రజాదీవెన యాత్రతో పెరిగిన జోష్

- చిరునవ్వులతో స్వాగతం పలికిన ప్రజానీకం
- మళ్లీ జగనే వస్తారన్న వైనం



రేలంగిలో ప్రజాదీవెన యాత్రలో మంత్రి కారుమూరి (ఫైల్)

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేపట్టిన ప్రజాదీవెన పాదయాత్రతో తణుకు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జోష్ పెరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటి నుంచి మంత్రులు, శాసనసభ్యులు ప్రజల మధ్యే ఉండాలని, ప్రజలను కలుస్తూనే ఉండాలనే స్పష్టమైన ఆదేశాలిచ్చి ఎన్నో కార్యక్రమాలను ప్రవేశపెట్టడంతో ఈ నాలుగున్నరేళ్లుగా మంత్రి కారుమూరి ప్రజల మధ్యే ఉంటూ వచ్చారు. అయితే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో ప్రజాదీవెన పాదయాత్ర నిర్వహిస్తూ అదేరోజు యాత్ర నిలిచిన చోటే పల్లె నిద్రలో భాగంగా చర్చిలు, కమ్యూనిటీ హాల్స్, సచివాలయాల్లో నిద్రించి ప్రజలతో మమేమకమయ్యారు. తొలి విడతలో భాగంగా ఈనెల 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకు అత్తిలి మండలంలోను, 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఇరగవరం మండలంలో పాదయాత్ర ముగించారు. సంక్రాంతి పండుగ అనంతరం ఇరగవరం మండలం నుంచి రెండో విడత ప్రజాదీవెన యాత్ర మొదలు పెట్టనున్నట్లుగా మంత్రి కారుమూరి తెలిపారు.

పాదయాత్రకు ప్రజల నీరాజనాలు

తణుకు నియోజకవర్గంలోని అత్తిలి మండలంలో అత్తిలిలో యాత్ర మొదలుపెట్టి కొమ్మర, ఈడూరు, కంచుమర్రు, ఆరవల్లి, దంతుపల్లి, ఉనికిలి, లక్ష్మీనారాయణపురం, ఉరదాళ్లపాలెం, వరిఘేడు, ఇరగవరం మండలంలో రేలంగి, కేతావారిపాలెం, ఇందిరా నగర్, చీలివారిపేట, గమళ్లపాలెం, చుక్కావారితోట, గవర్లపాలెం, బొబ్బరాసుపాలెం, మహలక్ష్మీచెర్వు గ్రామాల్లో మంత్రి కారుమూరికి ప్రజానీకం స్వాగతం పలుకుతూ హారతులు పట్టారు.

సాధారణ చార్జీలతో హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ (బీహెచ్‌ఈఎల్) నుంచి తాడేపల్లిగూడెంకు ప్రత్యేక బస్సులు ఈ నెల 13 వరకు నడపుతున్నట్లు 16, 17, 18 తేదీల్లో తాడేపల్లిగూడెం నుంచి హైదరాబాద్ (బీహెచ్‌ఈఎల్)కు సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. రానూ, పోనూ టికెట్ ఒకేసారి తీసుకుంటే టికెట్ ఛార్జీలో 10 శాతం తగ్గింపు ఇస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు విస్తరణ పనులతో ట్రాఫిక్ మళ్లింపు

అత్తిలి: అత్తిలి– తణుకు ఆర్అండ్‌బీ మార్గంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన నేపథ్యంలో ట్రాఫిక్‌ను దారి మళ్లించడం జరిగిందని ఆర్అండ్‌బీ ఏఈఈ డి రవిబాబు ప్రకటనలో తెలిపారు. అత్తిలి నుంచి గవర్లపాలెం వరకు సీసీ రోడ్డు, బీటీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో అత్తిలి తణుకు వెళ్లే వాహనాలు పాలి, రేలంగి మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించామని, ప్రయాణికులు గమనించి సహకరించాలని రవిబాబు కోరారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

అత్తిలి: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, జూద క్రీడలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు గురువారం చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైనా కోడిపందేలు, గుండాట, పేకాట, కోతాట, చట్ట వ్యతిరేక మద్యం అమ్మకాలు చేపడితే సమాచారాన్ని రెవెన్యూ, పోలీస్‌లకు తెలపాలని కోరారు. కోడిపందేల నిర్వహణకు రైతుల సొంత భూమిలో, ప్రభుత్వ భూముల్లో బరులు ఏర్పాటు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.